జిల్లాలో 800 ఎకరాల్లో నారుమడులకు నష్టం

» జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

దేవరాపల్లి, జూలై 23:
గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలో 800 ఎకరాల్లో వరి నారుమడులు దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. మంగళవారం పెదనందిపల్లి, చిననందిపల్లి గ్రామాల్లో వరి నారుమడులను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కౌలు రైతుల నమోదు, విస్తీర్ణం తదితర అంశాలపై వ్యవసాయాధికారి కాంతమ్మను ఆదేశించారు. అనంతరం ఆయన దేవరాపల్లి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి నారుమడులు దెబ్బతిన్నాయన్నారు. అధికంగా అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో నష్టం జరిగిందన్నారు. ముంపు తగ్గకపోతే అదనంగా 200 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటుందని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని చెప్పారు. జిల్లాలో గత ఏడాది 4,603 మంది కౌలు రైతులు కార్డులు అందజేశామన్నారు. ఈ ఏడాది 5,560 కార్డులు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వ్యవసాయ అధికారిణి కాంతమ్మ, విస్తరణాధికారి కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఊతం



ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక సాయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)
కేంద్రం బడ్జెట్ అనకాపల్లి జిల్లాకు కొంత వరకూ మేలు చేసేదిశగా ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణ చట్టంలో అమలు చేయకుండా వదిలేసిన వాటిని పూర్తిచేయడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఈసారి ప్రాధాన్యం ఇచ్చింది. ఉత్తరాంధ్రను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక సాయం చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు. గత ఐదేళ్లు ఈ సాయం అందలేదు. అంతకు ముందు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల నిధులు ఆగిపోయాయి. ఇప్పుడు వాటిని ఇవ్వనున్నారు. దీనివల్ల మౌలిక వసతులు మెరుగుపడడమే కాకుండా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు లభిస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ఎంఎస్‌ఎంఈలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ముద్ర రుణాల కింద ఇప్పటివరకూ ఇస్తున్న రూ.10 లక్షల రుణాన్ని రూ.20 లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. కొత్తగా ఉపాధి కల్పించే సంస్థలకు ఒక్కో ఉద్యోగికి నెల జీతం రాయితీ ఇస్తామని భరోసా కల్పించారు. దేశంలో వేయి పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునికీకరించి, పరిశ్రమలకు ఉపయోగపడేలా యువతకు శిక్షణ ఇస్తామని ప్రకటించారు. అందులో విశాఖ జిల్లాకు కూడా అవకాశం లభించనుంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన శిక్షణ ఇవ్వడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

● సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే మొదటి స్థానంలో ఉంది. అందులో అత్యధిక శాతం విశాఖపట్నం పోర్టు నుంచే ఎగుమతి అవుతున్నాయి. వీటిని ఇంకా ప్రోత్సహించడానికి కేంద్రం రొయ్యల మేతకు దిగుమతి చేసుకునే వాటిపై సుంకం ఐదు శాతం తగ్గించింది.

» మౌలిక వసతుల మెరుగుకు అవకాశం
» ముద్ర రుణాల పెంపు ద్వారా ఎంఎస్‌ఎంఈలకు చేయూత
» పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ
» మహిళలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ
» పోలవరం పూర్తితో సాగు, తాగునీరు
» కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా హర్షం

● పరిశ్రమల్లో మహిళలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. దీనివల్ల పారిశ్రామిక సంస్థల్లో మహిళల సంఖ్య పెరగనుంది.

● విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపులు జరుపుతామనడంతో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు ... మిగతా 6వ పేజీలో

బడ్జెట్ భేష్



కేంద్ర బడ్జెట్ ఏపీ అభివృద్ధికి దోహదపడేలా ఉంది. రానున్న రోజుల్లో సూక్ష్మ, భారీ పరిశ్రమలు అనేకం రానున్నాయి. విశాఖ, చెన్నై కారిడార్ పనులు పరుగులు పెట్టేందుకు కేంద్రం నిధులు మంజూరు చేయనుంది. కేంద్ర బడ్జెట్‌లో తొమ్మిది రకాల అంశాలకు ప్రాధాన్యం కల్పించారు. గ్రామీణాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులు జరగనున్నాయి. అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజల ఆర్థిక పురోభివృద్ధికి బడ్జెట్ దోహదపడనుంది.

- సీఎం రమేశ్, ఎంపీ, అనకాపల్లి

రైతులు, పేదలకు మేలు



కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌తో రైతులు, పేద వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. ఏపీ పునర్విభజన చట్టం కింద ఏపీకి రూ.15 వేల కోట్లు ప్రకటించడం హర్షించదగ్గ విషయం. వ్యవసాయ, పరిశోధన రంగాలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించడం శుభ పరిణామం.

- డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్, అనకాపల్లి

రాష్ట్రానికి మహర్దశ



కేంద్ర బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధుల కేటాయింపులు జరపడంతో రాష్ట్రానికి మహర్దశ పట్టనుంది. చంద్రబాబు నాయకత్వంలో అమరావతి రాజధాని పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఆంధ్రుల జీవనాడి పోలవరం పనులు వేగవంతం కానున్నాయి. రాష్ట్రానికి కేంద్రం బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తామని ప్రకటించడం గొప్ప విషయం.

- బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ

చెట్టుపల్లి పీఏసీఎస్‌లో అవినీతి తిమింగలం

సహకార సంఘంలో రూ.70 లక్షలు హాంఫట్

» నిధులు స్వాహా చేసి రిటైర్ అయిన సీఈవో
» సంవత్సరం క్రితమే వెలుగులోకి వచ్చిన అవకతవకలు
» చర్యలకు సహకార శాఖ అధికారుల తాత్సారం



చెట్టుపల్లి పీఏసీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, జూలై 23:
జానకిరామపురం పీఏసీఎస్‌లో నిధుల గోల్‌మాల్ వ్యవహారం మరువక ముందే నర్సీపట్నం డీసీసీబీ పరిధిలోని చెట్టుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గత ఏడాది మే నెలాఖరు వరకు సీఈవోగా పని చేసిన పిట్టా చలపతిరావు సుమారు రూ.70 లక్షలకు ఎగనామం పెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. అవకతవకల మీద సహకార శాఖ అధికారులు విచారణ జరిపారు. నిధులు దుర్వినియోగం వాస్తవమేనని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

సొసైటీ ఛైర్‌పర్సన్ అనుమతి లేకుండా పీఎఫ్ రుణాల పేరుతో అప్పటి సీఈవో చలపతిరావు రూ.19 లక్షలు దుర్వినియోగం చేసినట్టు సమాచారం ఉంది. కార్యాలయ సిబ్బంది జీతాల అడ్వాన్సులు చెల్లించినట్టు చూపించి రూ.1.23 లక్షలు దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఉన్నాయి. వంద మంది రైతుల నుంచి వ్యవసాయ రుణ బకాయిలు తక్కువ కట్టించుకొని పూర్తిగా చెల్లించినట్టు ఖాతాలు క్లోజ్ చేయడం ద్వారా రూ.14.53 లక్షలు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. సొసైటీ ఛైర్‌పర్సన్ చెల్లింపు ఆదేశాలు లేకుండా సిబ్బందికి జీతాలు పేరుతో రూ.రూ.27 లక్షలు వ్యక్తిగతంగా డ్రా చేసినట్టు అభియోగం ఉంది. రైతుల నుంచి రుణ బకాయిలు వసూలు చేసి నగదు వివరాలు రికార్డుల్లో నమోదు చేయకుండా అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సహకార శాఖ ఉన్నతాధికారులు అసిస్టెంట్ రిజిస్ట్రర్‌తో విచారణ చేయించారు. చెట్టుపల్లి పీఏసీఎస్‌లో సీఈవో సుమారు రూ.70 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు విచారణ అధికారి నిర్ధారించి ఎలమంచిలి డివిజినల్ సహకార అధికారికి ఎనిమిది నెలల క్రితం నివేదిక ఇచ్చారు. శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విచారణ నివేదికలో పొందుపరిచారు. అయితే సహకార శాఖ అధికారులు సంబంధిత విశ్రాంత ఉద్యోగిపై చట్ట పరమైన చర్యలు, నిధులు రికవరీ చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. సహకార శాఖ అధికారుల చూసీ చూడనట్టు వ్యవహరించడం, పర్యవేక్షణ లేకపోవడం వల్ల పీఏసీఎస్‌లలో కోట్ల రూపాయల నిధులు పక్కదారి పడుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఎలమంచిలి డివిజన్ సహకార అధికారి కిరణ్‌కుమారిని వివరణ కోరగా పీఏసీఎస్‌లోని రికార్డులు పరిశీలించామని, సెక్షన్ 16 ప్రకారం నోటీసులు ఇచ్చి మరోసారి విచారణ చేస్తామని తెలిపారు. తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నగరాభివృద్ధికి 100 రోజుల ప్రణాళిక

విశాఖను దేశంలోనే ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తా..

» సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తా..
» వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళతా
» స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరింత మెరుగైన ర్యాంకు సాధనకు యత్నం
» జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సంపత్‌కుమార్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):
విశాఖ నగరాభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక రూపొందించి అమలు చేస్తానని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. కమిషనర్‌గా మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కమిషనర్‌గా తన ప్రాధాన్యాలను వివరించారు. జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేయడాన్ని ఐఏఎస్ అధికారులు తమ కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా భావిస్తారన్నారు. అంతచక్కటి అవకాశం తనకు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా గతంలో పనిచేసిన తనకు జీవీఎంసీపై కొంత అవగాహన ఉందని సంపత్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీకి మంచి ర్యాంకు దక్కే అర్హత ఉన్నప్పటికీ కాపులుప్పాడ డంపింగ్ యార్డులో వ్యర్థాలు (లెగసీ వేస్ట్) ఎక్కువగా ఉండిపోవడం అవరోధంగా మారుతోందన్నారు. దీనిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు మధ్య వారధిగా ఉంటూ నగరంలో సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. పరిశుభ్రమైన, అందమైన నగరంగా గుర్తింపు కలిగిన విశాఖను దేశంలోనే ముందువరుసలో నిలిపేందుకు ప్రయత్నిస్తానన్నారు. నగరంలో సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. నగరంలో వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళతానన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది తమ సమస్యలపై తనను కలిసేందుకు నిర్దేశిత సమయం కేటాయిస్తానన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు, సీనియర్ అధికారులతో సమన్వయం చేసుకుని జీవీఎంసీని అభివృద్ధిపథంలో నడుపుతానన్నారు. సంపత్‌కుమార్‌ను జీవీఎంసీ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జీసీసీ ఎండీగా కల్పనాకుమారి బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, జూలై 23: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనాకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు అధికారులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. కల్పనాకుమారి బాధ్యతలు స్వీకరించిన వెంటనే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అరకు కాఫీ మార్కెటింగ్, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గిరిజన సహకార సంస్థలో విజిలెన్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, రిటైల్ మార్కెటింగ్, కాఫీ, పరిపాలన, అకౌంట్స్, రవాణా విభాగాలను, అరబికా కాఫీషాపు, ట్రైఫెడ్ రిటైల్ అవుట్‌లెట్, పలు అమ్మకం కేంద్రాలను పరిశీలించారు.

భమిడికలొద్ది లేటరైట్ క్వారీలో వాటాలు విక్రయం!

వైసీపీ నేతలకు తెలియకుండా అమ్మేసిన బ్రోకర్

» ప్రస్తుతం అజ్ఞాతంలో...
» నలుగురి వద్ద రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకూ వసూలు
» కూటమి నేతను ఆశ్రయించిన వాటాల కొనుగోలుదారులు

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):
అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోట పంచాయతీలోని భమిడికలొద్ది లేటరైట్ క్వారీ వ్యవహారాలు చూసిన దళారీ ఎన్నికల ముందు ముగ్గురి నుంచి నలుగురికి వాటాలు విక్రయించినట్టు తెలిసింది. అందుకోసం ఒక్కొక్కరి నుంచి మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకూ వసూలు చేసినట్టు సమాచారం.

సుందరకోట పంచాయతీ భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు కొయ్యూరు మండలానికి చెందిన జర్తా లక్ష్మణరావుకు అనుమతి ఇచ్చారు. లక్ష్మణరావు వెనుక వైసీపీ కీలక నేతలు ఉండడంతో భమిడికలొద్ది ప్రాంతంలో ప్రైవేటు సైన్యం ఏర్పాటుచేసుకుని లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్ తవ్వి తీసుకుపోయారు. అయితే క్వారీ ప్రాంతంపై, రవాణా కోసం భమిడికలొద్ది నుంచి సరిహద్దులో ఉన్న తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి మండలం జల్దాం వరకు నిర్మించిన రహదారిపై వివాదం చెలరేగింది. మైనింగ్, రహదారి కోసం చెట్లు కొట్టేయడం వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు విఘాతం కలుగుతుందని పేర్కొంటూ నాతవరం మండలానికి చెందిన మరిడయ్య ఎన్జీటీలో ఫిర్యాదు చేయడంతో గడచిన ఏడాదిన్నర నుంచి లేటరైట్ తవ్వకాలు నిలిచిపోయాయి. కాగా వైసీపీ పెద్దల తరఫున స్థానికంగా వ్యవహారాలు నడిపిన ఓ వ్యక్తి తన అవసరాలు, విలాసాల కోసం భారీగా అప్పులు చేసేశాడు. ఆ అప్పులు తీర్చుకోవడంతోపాటు భవిష్యత్తులో సెటిల్ కావాలనే ఉద్దేశంతో ఎన్నికల ముందు వ్యాపారంలో వాటాల విక్రయం పేరుతో పలువురి నుంచి భారీగా డబ్బులు తీసుకున్నాడు. 2024లో వైసీపీ ... మిగతా 6వ పేజీలో



సుందరకోట పంచాయతీ భమికలొద్ది దగ్గర గతంలో లేటరైట్ తవ్వకాలు జరిగిన ప్రదేశం



వానొస్తే చెరువే..

బీఎన్ రోడ్డు గోతులమయం

భీమునిపట్నం- నర్సీపట్నం(బీఎన్) రోడ్డు గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువును తలపిస్తోంది. రావికమతం నుంచి మేడివాడ పెద్ద చెరువు వరకు భారీ గోతులు ఉండడంతో అందులో వర్షపు నీరు చేరింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - రావికమతం

బీఎన్ రోడ్డులో మేడివాడ విడుదల వారి ఇళ్లు, పాత సంతబయలు వద్ద రహదారి ఇలా..

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథన్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):
విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కేఎస్ విశ్వనాథన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఎస్‌ఈ బలరామరాజు, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, సీయూపీ సంజయ్ రత్నకుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆ తరువాత ఆయన పరిపాలన విభాగం, అర్బన్ ఫారెస్ట్రీ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించి, విధి విధానాలు, ఎవరు ఏ బాధ్యతలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

సైమెలెక్స్ ఫార్మాలో ప్రమాదం

కాంట్రాక్టు కార్మికుడి మృతి

పరవాడ, జూలై 23 : ఫార్మాసిటీలోని సైమెలెక్స్ లేబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని గంజామ్ జిల్లాలో గల బరిడా గ్రామానికి చెందిన కబిరాజ్‌సాహు(58) గత కొంతకాలంగా సైమెలెక్స్ ఫార్మా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తానాం గ్రామంలో నివాసం ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం విధులకు హాజరయ్యాడు. పరిశ్రమ ప్రొడక్షన్ బ్లాక్-ఏలో సాహు క్లీనింగ్ పనులు చే పడుతుంటాడు. సమీపంలో 10 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వ్యాక్యూమ్ మోటార్ పంపు ఉంది. అతను పని చేస్తున్న ప్రదేశానికి సుమారు 50 మీటర్ల దూరంలో మోటారు ఉంది. అయితే రన్నింగ్‌లో ఉన్న మోటార్ బెల్టులో సాహు చెయ్యి చిక్కుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే అతను అక్కడికి ఎందుకు వెళ్లాడో తెలియరాలేదు. మోటారులో చిక్కుకోవడంతో శరీరమంతా గాయాలపాలవ్వడంతో కుడి చెయ్యి బాగా నుజ్జునుజ్జు అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సంఘటన స్థలాన్ని ఆర్డీవో చిన్నికృష్ణ, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ బాల సూర్యారావు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ, తదితరులు

అనకాపల్లి, భీమిలిపై జీవీఎంసీ నిర్లక్ష్యం

అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



కొత్తూరు, జూలై 23 : అనకాపల్లి, భీమిలి మున్సిపాలిటీలు గ్రేటర్ విశాఖలో విలీనమైనప్పటికీ వాటిపై జీవీఎంసీ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఈ రెండు ప్రాంతాల అభివృద్ధి గురించి జీవీఎంసీ పట్టించుకోలేదన్నారు. కనీస అవసరాలైన డ్రైనేజీ వంటివి కూడా లేకుండా పోయాయని, విశాఖపట్నం నగరంలో మాదిరిగా అండ్ గ్రౌండ్ డ్రైనేజీ రావాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం, అనకాపల్లి, భీమిలి ఈ మూడు ప్రాంతాల్ని కూడా కనెక్ట్ చేస్తూ నిర్మాణం చేయాల్సిన మెట్రో ప్రాజెక్టును ఏ విధంగా పక్కన పెట్టారో అనే అంశాలను కూడా సభ దృష్టికి తీసుకువెళ్లారు. వీటన్నింటినీ పూర్తి చేసేందుకు ఒక యాక్షన్ ప్లాన్‌ని రూపొందించాలని ప్రభుత్వానికి సూచించారు. దేశంలో ఎక్కడా నగరం నడిబొడ్డున మున్సిపల్ ఆఫీసులో డంపింగ్ యార్డు అనేది నిర్వహణ ఉండదని ఒక్క అనకాపల్లిలోనే డంపింగ్ యార్డు కార్యాలయాన్ని ఆనుకొని ఉందన్నారు. వెంటనే ఈ డంపింగ్ యార్డును తరలించే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రహదారి నాణ్యతపై కమిటీ తనిఖీ

నక్కపల్లి, జూలై 23 : మండలంలోని రాజయ్యపేట నుంచి సీహెచ్ఎల్ పురం వరకూ గత ఏడాది నిర్మించిన ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణ పనులను మంగళవారం ఉన్నత స్థాయి కమిటీ బృందం పరిశీలించింది. సుమారు 8.5 కి.మీ పొడవునరూ.3.2 కోటతో గత ఏడాది రహదారిని నిర్మించారు. తాజాగా.. ఈ రహదారి నాణ్యత ప్రమాణాలపై కేంద్ర కమిటీ ప్రతినిధి బినయ్ సింహ తనిఖీలు నిర్వహించారు. స్థానిక డీఈ ఎస్.కుమార్ రాజు, ఏఈ ఎస్‌వీ రాజులతో మాట్లాడారు.



రహదారిని పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 23 : స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీవారి పవిత్రోత్సవాలు మంగళవారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ జరిగి వందేళ్లు అయిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, ఆలయ పర్యవేక్షకులు సకల గోవిందరావు, అర్చకులు పులకండం ప్రసాద్‌బాబు, పులకండం రాజేష్‌బాబు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో 4 స్వర్ణ పతకాలు

ఎలమంచిలి, జూలై 23 : గుంటూరు జిల్లా రేపల్లెలో ఈ నెల 19 నుంచి రెండు రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి 3వ సబ్ జూనియర్, కేడెట్ తైక్వాండో టోర్నీలో ఎలమంచిలి క్రీడా వికాస కేంద్రం క్రీడాకారులు 3 స్వర్ణ, 1 కాంస్య పతకం సాధించడంతో పాటు వచ్చే నెల 16 నుంచి రెండు రోజులు పాటు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎస్‌వీఎన్ రమేష్ తెలిపారు. విజేతలకు క్రీడా వికాస కేంద్రం ప్రతినిధులు రెడ్డి రామ్‌చరణ్, ఎ.కొండలరావు అభినందించారు.



స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు

సీఆర్‌జెడ్ భూములను కాపాడాలని వినతి

పరవాడ, జూలై 23 : ముత్యాలమ్మపాలెం సముద్రతీరం సీఆర్‌జెడ్ పరిధిలోని భూములు కబ్జా కాకుండా చూడాలని కలెక్టర్ విజయకృష్ణన్‌ను ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఆర్‌జెడ్ పరిధిలో గల భూముల్లో చెట్లు, సరుగుడు తోటలు ఉండేవని, ఇటీవల వాటిని కొంతమంది వ్యక్తులు తొలగించి సదరు స్థలాన్ని దొంగ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయాలు జరుపుతున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కె. మహేశ్, ఎస్.రాజు, కొవిరి నంబారి, సీహెచ్. అప్పలరాజు, తదితరులు వున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ తీరు బాగాలేదు : సీపీఎం

అచ్యుతాపురం రూరల్, జూలై 23 : కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ డ్రాఫ్ నోటిఫికేషన్‌పై మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరపడంపై సీపీఎం మండల అధ్యక్షుడు రొంగలి రాము అభ్యంతరం వ్యక్తం చేశారు. పూడిమడకలో మండల కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత మాస్టర్ ప్లాన్ తయారీకి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ మత్స్యకారులకు తెలియజేయకపోవడం విచారకరమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అనేది ప్రజల మధ్యలో నిర్వహించాల్సి ఉండగా ప్రజలకు సమాచారం అందించకుండా కేవలం తమకు అనుకూలమైన వారిని జిల్లా కలెక్టర్ కేంద్రానికి పిలిపించి తంతు పూర్తి చేయడం ఏమిటని ప్రశ్నించారు.

'సీడ్ విలేజ్' ఎంతో ఉపయోగం : ఏవో రంగాచారి

కొత్తూరు, జూలై 23 : రైతులకు కావాల్సిన విత్తనాలు నేరుగా తయారు చేసుకునేందుకు 'సీడ్ విలేజ్' ఎంతో ఉపయోగమని అనకాపల్లి మండల వ్యవసాయాధికారి రంగాచారి అన్నారు. పొలంబడి, సీడ్ విలేజ్‌లో భాగంగా రైతులతో కలిసి మంగళవారం సీతానగరంలో క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు అందించారు.

పారా ఒలింపిక్ విజేతకు అభినందనలు



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎలమంచిలి, జూలై 23 : ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి అన్నం గణేష్ భారత్ తరపున అంతర్జాతీయ పారా ఒలింపిక్ పోటీల్లో పాల్గొని బీచ్ వాలీబాల్‌లో రజత పతకం సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డిలు అభినందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న గణేష్‌కు కేంద్ర ప్రభుత్వం క్రీడా కేటగిరీ ఉద్యోగాలలో గ్రూప సి ఉద్యోగానికి అర్హత పొందినట్లుతెలిపారు.

ఆధార్ కేంద్రాల్లో సేవలు వినియోగించుకోవాలి

జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 23 : ఆధార్ కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు సచివాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. పట్టణంలోని మంగళవారం పలు సచివాలయాల్లో ప్రారంభమైన ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆధార్‌లో చోటు చేసుకున్న సమస్యలపై వచ్చే ప్రజలకు పూర్తి స్థాయిలో వివరాలు తీసుకుని సరి చేయాలని సూచించారు. ప్రజలంతా ఈ ప్రత్యేక క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తూరు : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ కార్యాయంలో ఆధార్ నమోదు కేంద్రం మంగళవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు జోగా భాను, పంచాయతీ కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొని మీ సేవలో సేవలు పంచాయతీలో ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆధార్‌కార్డులో ఎవరివైనా పేర్లు తప్పులు ఉంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్ళి సరిచేసుకోవాలని సూచించారు.



అనకాపల్లి ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్సీ అయ్యప్పనాయుడు



కొత్తూరు : నారాయణపురంలో ప్రారంభమైన ఆధార్ కేంద్రం

పాఠశాలల్లో డెప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ

ఎస్.రాయవరం, జూలై 23 : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సైతారుపేట జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన ఆయన బాత్‌రూమ్‌లు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. విద్యార్థుల నోట్ బుక్స్ కరెక్షన్స్ తనిఖీ చేసిన అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

అనంతరం మండలంలోని సర్వసిద్ధి ఎంపీయూపీ స్కూల్‌ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీలు

పాయకరావుపేట, జూలై 23 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.సుభాష్ అన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్ వాడలోని లోతట్టు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించిన పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రజలకు డెంగ్యూ, డయేరియా, మలేరియా తదితర సీజనల్ వాధ్యులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పీవీ రమణ, ఎంపీహెచ్‌ఎస్ ఎం.నాగేశ్వరరావుతో పాటు పలువురు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు పాల్గొని అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, సిబ్బంది సత్యవతి, విజయలక్ష్మి, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

తిలక్, ఆజాద్ యువతకు ఆదర్శం



కార్యక్రమంలో పాల్గొన్న లెక్చరర్లు

సబ్బవరం, జూలై 23 : స్వాతంత్ర సమరయోధులు లోకమాన్య బాలగంగాధర తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లు యువతకు ఆదర్శమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం తిలక్, ఆజాద్‌ల జయంతి వేడుకలు చరిత్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సిబ్బంది వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడు తూ.. భారత స్వాతంత్ర పోరాటంలో తిలక్, ఆజాద్‌ల తిరిగిలేని పోరాటం జాతి మరువ రానిదన్నారు.వారి సాహసోపేత పోరాటాలు విద్యార్థులకు మార్గదర్శం కావా లన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, బి.లక్ష్మి, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు



అనకాపల్లి : పతాకావిష్కరణ చేస్తున్న శ్రీరాములు

అనకాపల్లి టౌన్, జూలై 23 : స్థానిక రామచంద్ర థియేటర్ వద్ద మోటార్ సైకిల్ మెకానిక్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. బీఎంఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గోకివాడ శ్రీరాములు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 70 ఏళ్లుగా భారతీయ మజ్దూర్ సంఘం కార్మిక రంగానికి సేవలు చేస్తుందన్నారు. సంఘాన్ని మానవీయ దత్తోపంత్ స్వాతంత్ర యోధుడైన బాలగంగాధర్‌తిలక్ జన్మదినం జూలై 23న భోపాల్‌లో 1955లో స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ సైకిల్ మెకానిక్స్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు మారిశెట్టి శంకరరావు, సంఘ ప్రతినిధులు పూడి రాజు, జక్కుల గణేష్, మహేష్, ఎండీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : భారత మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికసంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎంఎస్ అఖిలభారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత మజ్దూర్ సంఘ్ స్థాపించి నేటికి 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని 70వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. కార్మికుల హక్కుల కోసం బీఎంఎస్ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్, యూనియన్ అధ్యక్షుడు బొట్టా రమణ, ప్రధానకార్యదర్శి కూండ్రపు సతీష్, గొర్లి నాగభూషణం, బండారు బాలాజీ, బండారు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లిలోని బీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం భారతీయ మంజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఎస్‌ఎం అఖిల భారత ఉపాధ్యక్షులు మళ్ల జగదీశ్వరరావు బీఎంఎస్ ప్రతినిధులతో కలిసి మజ్దూర్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మిక సోదరులు బీఎస్‌ఎం యూనియన్‌లో చేరి బీఎస్‌ఎం బలోపేతానికి కృషి చేయాలని జగదీశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎం రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్, జిల్లా కన్వీనర్ బొట్టా రమణ, మండల కార్యదర్శి నూకరాజు, వాడనర్సాపురం మాజీ సర్పంచ్ సీహెచ్ ఎర్రయ్య, యూనియన్ ప్రతినిధులు సీహెచ్ గగన్, చెల్లూరి కోదండరావు, కారే రాముడు, కె.పవన్, శివ, బలరామ్ కార్మికులు పాల్గొన్నారు.



రాంబిల్లి : జెండా ఆవిష్కరిస్తున్న జగదీశ్వరరావు

రైతులను ఆదుకోవాలి : రైతు, కార్మిక సంఘం నేతలు

రాంబిల్లి, జూలై 23 : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పంచదార్ల, రాజుకోడూరు గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను మంగళవారం రైతు, కార్మిక సంఘం నేతలు పరిశీలించారు. వీరు ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. భారీ వర్షాల వల్ల ఎదురైన పరిస్థితుల గురించి తెలుసుకున్నారు.ఈ సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు రైతు భరోసాను రైతులు, కౌలు రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐయూటీ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, రైతు సంఘం నాయకులు వై.శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నాయకులు బి.అప్పారావు, కె.వెంకటరమణ, వై.రాము, అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో 9, 10 తరగతులు

నక్కపల్లి, జూలై 23 : మండలంలోని పెదబోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం గత మూడేళ్ళ నుంచి శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత అధ్వానంగా తయారై గదులు ప్రమాదకరంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులను ఆ గదుల్లో కూర్చోబెట్టవద్దని గత ఆదివారం పాఠశాలను తనిఖీ చేసిన అనంతరం డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి పెదబోదిగల్లం హైస్కూల్‌లోని 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులను సమీపంలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్ భవనానికి తరలించి విద్యాబోధన చేస్తున్నారు.

జనసేన సభ్యత్వానికి అన్ని వర్గాల నుంచి ఆదరణ : తోట నగేశ్

పాయకరావుపేట, జూలై 23 : జనసేన పార్టీలోకి చేరేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపుతున్నందున పాయకరావుపేట నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు పార్టీ శ్రేణులు పండుగలా చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, జనసేన పార్టీ నాయకులు తోట నగేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం పాయకరావుపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తోట నగేశ్‌తో పాటు పలువురు నాయకులు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తను పార్టీ అన్ని విధాలా ఆదుకుంటూ భరోసా ఇవ్వడంతో పాటు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగతా శ్రీనివాస్, ఇంజరపు సూరిబాబు, రాజా రమేష్, ఐఎన్. మూర్తి, ముక్కుడుపల్లి నాగరాజు, చిట్టూరి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున నగేశ్ తదితరులు

ఫార్మాసిటీలో ప్రమాదంపై విచారణ జరపాలి

అనకాపల్లి టౌన్, జూలై 23 : జిల్లాలోని పరవాడ ఫార్మాసిటీలో మంగళవారం జరిగిన ప్రమాదంపై విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా నాయకుడు వీవీ శ్రీనివాసరావులు వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మైలెక్స్ ఫార్మా ప్రమాదంలో ఒడిశాకు చెందిన కబీ అనే కార్మికుడు మృతి చెందాడని మృతి చెందిన కార్మికుడు కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని కోరారు.

ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అభివృద్ధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

పెడుతుందనే ఆశలు రేకెత్తుతున్నాయి.

● కేంద్ర బడ్జెట్‌లో పారిశ్రామిక ప్రగతికి నిధులు రానుండడంతో అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు జిల్లాకు వచ్చే అవకాశాలున్నాయి. కేంద్ర బడ్జెట్ కేటాయింపులు అన్నివర్గాల ప్రజల ఆర్థిక వృద్ధితో పాటు రాబోయే రోజుల్లో పారిశ్రామికంగా అభివృద్ధి సాధించి యువతకుఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

పోలవరం పూర్తితో ఉత్తరాంధ్రాకు మేలు

పోలవరం పూర్తిచేసే బాధ్యత తీసుకుంటామని ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల ఉత్తరాంధ్రా జిల్లాలకు మేలు జరగనుంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన నీటితో పాటు సాగునీరు, నగర వాసుల తాగునీటి సమస్యలు తొలగిపోతాయి. అదేవిధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి దోహదపడుతుంది.

పదేళ్లలో రాష్ట్రానికి మేలు చేకూర్చిన ఏకైక బడ్జెట్ ఇదే

- ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఏయూ



గడిచిన పదేళ్లలో రాష్ట్రానికి మేలు చేకూర్చిన ఏకైన బడ్జెట్ ఇదే. విభజన చట్టంలో పేర్కొన్న అనేక అంశాలకు సంబంధించి మేలు చేకూర్చేందుకు కేంద్రం సిద్ధమైనట్టుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనతో స్పష్టమైంది. ఆర్థికంగా బిహార్ కంటే రాష్ట్రానికి ఎక్కువ లబ్ధిని చేకూర్చేలా అనేక అంశాలపై ప్రకటన చేశారు. ముఖ్యంగా రాజధానికి ఆర్థిక సాయం అందించడంతోపాటు ఉత్తరాంధ్రతోపాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు అందిస్తామని ప్రకటించడం హర్షనీయం. దీనివల్ల రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగి, యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తంగా చూస్తే బడ్జెట్ మెరుగ్గా ఉంది. వ్యవసాయానికి కూడా భారీగా కేటాయింపులు పెంచారు. మహిళలు ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి భారీగా కేటాయింపులు చేయడం శుభపరిణామంగా చెప్పవచ్చు.

భమిడికలొద్ది లేటరైట్ క్వారీలో..

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందని, గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న వివాదాలు పరిష్కారమై క్వారీయింగ్ మొదలు పెడతామని వారిని నమ్మించాడు. అనపర్తికి సమీపంలో గల రాయవరానికి చెందిన ఒక ఫైనాన్షియర్ (గత ప్రభుత్వంలో కీలక కార్పొరేషన్ ఛైర్మన్ బినామీ)కు ఒక వాటా అమ్మేసి రెండు నుంచి మూడు కోట్ల రూపాయల వరకు తీసుకున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ఒకరి నుంచి, హైదరాబాద్‌లో సినీ నిర్మాణదారుడి నుంచి మూడు, నాలుగు కోట్ల రూపాయల చొప్పున తీసుకున్నాడు. ఇంకా తూర్పుగోదావరి జిల్లాలో మరో వ్యక్తి నుంచి రెండున్నర కోట్లు తీసుకున్నాడు. లీజుదారుడికి తెలియకుండా వ్యాపారంలో వాటాలు అమ్మకాలు జరిపినట్టు ఆలస్యంగా తెలిసింది. ఇదిలావుండగా క్వారీని బినామీ పేరిట తీసుకున్న వైసీపీ కీలక నేతలకు కూడా సమాచారం అందడంతో సంబంధిత వ్యక్తిని పిలిచి గట్టిగా హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో అతను అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని సరుగుడు ప్రాంతంలో లేటరైట్ క్వారీలో పనిచేసినవారు చెబుతున్నారు. ఇదిలావుండగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వైసీపీ పెద్దలు ఈ క్వారీపై మౌనంగా ఉండిపోయారు. భమిడికలొద్ది క్వారీలో వాటాలు కొనుగోలు చేసినవారు తమ వద్ద డబ్బులు తీసుకున్న బ్రోకర్ కోసం అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో వాటాలు కొనుగోలు చేసిన వారిలో ఒకర్దిదరు ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన కలిసి తమ గోడు చెప్పుకున్నారని తెలిసింది.

సంక్షిప్తంగా..

విజ్ఞానదాయకంగా శిక్షా సప్తాహ్



కశింకోట : నిపుణ్ భారత్ మిషన్ ప్రతిజ్ఞ చేస్తున్న టీచర్లు

అచ్యుతాపురం రూరల్, జూలై 23 : మండలంలోని నునపర్తి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శిక్ష సప్తాహ్ నిర్వహించారు. అలాగే నూతన విద్యా విధానం నాలుగో వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో సర్పంచ్ చుక్క అనురాధ, మాజీ ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు సమక్షంలో విద్యార్థులు టీఎల్ఎం ప్రదర్శన చేశారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులతో నిపుణ్ భారత్ మిషన్ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు యూనిఫారాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ కృష్ణ, చిన్నబాబు, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని టీడీపీ మండల ఉపాధ్యక్షులు అందుకూరి ప్రసాద్ ఉపాధ్యాయులను కోరారు.మంగళవారం మూలజంప జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన శిక్ష సప్తాహ్ ఎన్ఈపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీశ్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ వేగి శివశంకర్, గ్రామ నాయకులు వేగి రామ శంకరరావు, భాస్కరరావు, లోవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్ల : శిక్ష సప్తాహ్ విద్యా వారోత్సవాలలో భాగంగా బోడపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో కాస్ట్ అండ్ నో కాస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సాంబశివరావు, సాయి, త్రినాథ్‌రావు, సత్యవేణి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.మహేశ్వరి అధ్యక్షతన పలు విజ్ఞాయదాయక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వనరులతో బోధనా సామగ్రి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కందూరు రాజు, ఉపాధ్యాయులు సధాలక్ష్మి, శ్రీదేవి, పద్మావతి, భవాని పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రమైన కశింకోట డీపీఎస్ హైస్కూలు, వెదురుపర్తి ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ మంగళవారం ఘనంగా జరిగింది. డీపీఎస్ స్కూలు కార్యక్రమంలో ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తిలు పాల్గొని విద్యార్థులకు పలు రకాల టీఎల్ఎం మెటీరియల్స్, చార్ట్స్ ప్రదర్శన చేశారు. అనంతరం విద్యార్థులకు పలు నమూనాలు తయారు చేసే విధానాల్లో మెళుకువలు వివరించారు. వెదురుపర్తిలో హెచ్‌ఎం జీవీకే ఆచారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ఔదార్యం

సబ్బవరం, జూలై 23 : మండలంలోని రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు తమ మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. 1985-86లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో ఒకరైన సలుమూరి శ్రీరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అంతా తలా కొంత వేసుకొని రూ.40 వేలు పోగు చేశారు. మంగళవారం వారంతా రావలమ్మపాలెం వెళ్లి స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్బవరపు నర్సింహమూర్తి, కామిరెడ్డి రాము, కొల్లి వెంకటరమణ, లాలం సుజాత, చల్లా రత్నం తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ ఆలయానికి విరాళం

మునగపాక (తుమ్మపాల), జూలై 23 : మండలంలోని మూలపేట గ్రామ ఇలవేల్పు గంగాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్వర్గీయ బొడ్డేడ నరసింగరావు జ్ఞాపకార్థం అతని కుటుంబీకులు రూ.50 వేల 116లను విరాళంగా అందజేశారు. గ్రామ దేవత గంగాలమ్మ అందరినీ చల్లగా చూడాలని కోరుకుంటూ తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్టు కుటుంబసభ్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసింగరావు కుటుంబసభ్యులు మణి, రవికుమార్, సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించండి



వినతిపత్రాన్ని అందిస్తున్న కూలీలు

మునగపాక (తుమ్మపాల), జూలై 23 : ఉపాధి కూలీలకు పది వారాల బకాయిలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపాధి కూలీలతో కలిసి మంగళవారం తోటాడ, టి. సిరసపల్లి సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టి అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా నడుస్తున్న ఉపాధి పథకాన్ని నీరుగార్చడం దారుణమన్నారు. పది వారాలుగా వేతన బకాయిలు చెల్లించకపోవడంతో పేద కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే బకాయిలను చెల్లించాలని, లేదంటే మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలను సమీకరించిప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బడ్జెట్లో వినియోగదారుల హక్కులకు రక్షణేది

అనకాపల్లి టౌన్, జూలై 23 : వినియోగదారుల హక్కుల రక్షణకు బడ్జెట్‌లో కనీస ప్రాధాన్యత లేదని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ వినియోగదారులపై ఆధారపడి ఉందన్న విషయాన్ని గుర్తించకపోవడం విచారకరమన్నారు. ఆహార భద్రత నాణ్యత ప్రమాణాలు, ఈ కామర్స్ వినియోగదారుల రక్షణ, వినియోగదారుల కమిషన్ల పరిపుష్టికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, ఆహార కల్తీ నిరోధానికి నిధులు కేటాయిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ఊసెత్తకపోవడం విచారకరమని వెంకటరమణ అన్నారు.

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య


మృతుడు సాకేటి రాము

మాకవరపాలెం, జూలై 23: మండలంలో కొత్తపాలెం గ్రామంలో నివాసముంటున్న ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ. రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం మృతుని భార్య సాకేటి అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన సాకేటి రాము (35) 2012 సంవత్సరం నుంచి మండలంలోని కొత్తపాలెం గ్రామం శివారు రామరాజు మామిడి తోటలో పనిచేస్తున్నాడు. తర్వాత 2021లో ఎరకన్నపాలెం గ్రామంలో సన్నిబాబు మామిడి తోటలో కూలీ పనులు చేస్తున్నాడు. అయితే అతనికి కొత్తపాలెంలో ఉన్న సొంతింటికి వెళ్లిపోదామని తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో 22వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు మామిడి తోటలో పని ముగించుకొని స్వగ్రామం వెళ్లిపోదామని గొడవచేయగా, కొత్తపాలెంలో ఉన్న సొంతింటికి వచ్చేశామని భార్య అపర్ణ తెలిపింది. అయితే 23వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు తోట యజమాని సన్నిబాబు ఫోన్ చేసి తోటలో ఉన్న షెడ్‌లో రాము ఉరివేసుకొని ఉన్నాడని తెలిపారు. అక్కడికి వెళ్లి చూసేసరికి నా భర్త రేకుల షెడ్డులో ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడని తెలిపింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆశ కార్యకర్త మృతి

డుంబ్రిగుడ, జూలై 23: మండలంలోని అరకు-పాడేరు జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆశ కార్యకర్త మృతి చెందింది. నేరుడువలస గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త పాంగి తులమ్మ(48) రోడ్డు దాటుతుండగా అరకు వైపు నుంచి పాడేరు వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమెకు స్థానికులు సపర్యలు చేసినప్పటికీ మృతి చెందిందని బాధిత కుటుంబీకులు భోరుమన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్థానికులు వెంబడించినా స్పీడుగా వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై బాధిత కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

- గొర్లివానిపాలెం, పెదముషిడివాడ పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ


ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సందీప్

పరవాడ, జూలై 23: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని, తక్షణమే విచారణ చేపట్టాలని గొర్లివానిపాలెం, పెదముషిడివాడ పంచాయతీల నాయకులు డిమాండ్ చేశారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌కు సంబంధించిన విషయాలను తెలియపరిచేందుకు మంగళవారం పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ పీడీ సందీప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆడిటర్లు మాట్లాడుతూ.. పెదముషిడివాడ, గొర్లివానిపాలెం పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్టు వెల్లడించారు. తక్కువ మంది కూలీలతో పనులు చేయించి ఎక్కువ మందికి డబ్బులు చెల్లించినట్టు ఆడిట్‌లో గుర్తించారు. అలాగే ఒకరి పేరుకు బదులు మరొకరితో పనులు కూడా చేయించారు. జాబ్‌కార్డులు లేనప్పటికీ బయట వ్యక్తులతో పనులు చేయించారని పేర్కొన్నారు. దీనిపై మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, బంధం వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ తక్కువ మంది కూలీలతో పనులు చేయించి ఎక్కువ మంది కూలీలకు డబ్బులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు వీరి వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. విచారణ సమయంలో డీఆర్‌డీఏ పీడీ నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే ఆయనపై కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. గొర్లివానిపాలెం పంచాయతీలో 85 కొబ్బరి మొక్కలు నాటినట్టు రికార్డుల్లో పొందుపరిచారని, కానీ మూడు మొక్కలు మాత్రమే ఉన్నాయని మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు ప్రస్తావించారు. మొక్కలకు సంబంధించిన లెక్కలు కూడా తేల్చాలని డిమాండ్ చేశారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా రూ.6 కోట్ల 38 లక్షలతో పనులు చేపట్టినట్టు ఎంపీడీవో కీర్తి స్పందన వెల్లడించారు. వీటిలో కూలీలకు రూ.5 కోట్ల 27 లక్షలు చెల్లించామని, మిగతా రూ.కోటి 11 లక్షలు మెటీరియల్‌కు చెల్లించినట్టు చెప్పారు. పెదముషిడివాడ, గొర్లివానిపాలెం పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపడతామని పీడీ సందీప్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, ఏపీడీ వెంకటరమణ, జిల్లా విజిలెన్స్ అధికారిణి నిర్మలాదేవి, ఎస్ఆర్‌పీ నాగరాజు, ఏపీవో గోవిందరావు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై అద్భుత కళాకృతులు

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు -2024లో ఖ్యాతిశ్రీకి స్థానం


ఇండియా బుక్ ఆఫ్ రికార్డుతో ఖ్యాతిశ్రీ

తుమ్మపాల, జూలై 23 : అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన కొణతాల ఖ్యాతిశ్రీ పెన్సిల్ ముల్లుపై పలు కళాకృతులను చెక్కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు -2024లో స్థానం సంపాదించింది. పెన్సిల్ ముల్లుపై జాతీయజెండా, హిందూ దేవతల పేర్లు, పలువురి పేర్లను చెక్కి తన ప్రతిభను చాటింది. ఖ్యాతిశ్రీ తండ్రి శివాజీ సామిల్లును నిర్వహిస్తుండగా, తల్లి జ్యోతి శ్రావణి గృహిణి. ఖ్యాతిశ్రీ ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఎన్‌డీఏకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఖ్యాతిశ్రీ ప్రతిభను పలువురు ప్రశంసిస్తున్నారు.

సబ్బవరం స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ


డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ రమణతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

సబ్బవరం, జూలై 23: సబ్బవరం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ దీపిక మంగళవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. సీజ్ చేసిన వాహనా లను పరిశీలించి, వాటి వివరాలను వాహనాలకు ట్యాగ్ చేయాలని సూచించారు. రికార్డులు పరిశీలించి తరచూ నమోదవుతున్న నేరాలు, రౌడీ షీటర్ల వివరాలు, గతంలో స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసుల సీడీ ఫైల్స్, తీవ్రమైన కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. ఆయా కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్ రిసెప్షన్ పుస్తకం నిర్వహించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని సూచించారు. రౌడీ షీటర్లపై దృష్టి సారించాలన్నారు. గంజాయి రవాణాపై దృష్టి పెట్టి, కారకులైన వారిని గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశించారు. నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఆమె వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రమణ, సిబ్బంది ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్‌కు పక్కా ప్రణాళిక అవసరం

- మత్స్యకారుల మనుగడకు ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలి
- పరిశ్రమలు, టూరిజం ప్రాజెక్టుల్లోనూ 75 శాతం స్థానికులకే ఉపాధి అవకాశాలు ఇవ్వాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు వక్తల అభిప్రాయం


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టబోయే కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలో భాగంగా తీర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఆయా ప్రాంతాల్లోని మత్స్యకారుల జీవనానికి ముప్పు కలిగేలా ప్రణాళిక అమలు చేయవద్దని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు, వివిధ టూరిజం శాఖల అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానికులకే 75 శాతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక అమలు కోసం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షత వహించారు. జిల్లాలో తీర ప్రాంత గ్రామాల నుంచి 120 మంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా 2019 కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు సంబంధించిన నోటిఫికేషన్ గురించి ప్రతినిధులకు అధికారులు వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తీర ప్రాంతాల్లో టూరిజం, జీవనోపాధి, జీవశాస్త్రపరంగా చురుకైన మడ్ పాట్లు, కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఓడరేవుల అభివృద్ధిపై ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ తీర ప్రాంతాల నుంచి మత్స్యకారులను బయటకు పంపే ప్రయత్నాలు చేయరాదని సూచించారు. ఇప్పటికే ఎస్ఈజెడ్, ఎన్‌టీపీసీ వంటి కంపెనీల వల్ల సముద్రం డంపింగ్ యార్డులా తయారైందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ఆయా గ్రామాల్లో పెట్టాల్సి వుంటే నాలుగు గోడల మధ్య నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు.

అభివృద్ధి పనులు చేపడితే అభ్యంతరం లేదని, అయితే సముద్రంపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారుల మనుగడకు ముప్పు వాటిల్లే విధంగా చర్యలు లేకుండా చూడాలని కోరారు.

నక్కపల్లి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కొప్పిశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ తీర ప్రాంతాల అభివృద్ధి, కంపెనీల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదన్నారు. స్థానికులకు ఆయా కంపెనీల్లో 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. రాంబిల్లి మండలానికి చెందిన డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ మాట్లాడుతూ ఎస్ఈజెడ్, ఎన్ఏఓబీ వల్ల మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కు వ్యతిరేకం కాదని, స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలకు పునరావాస చర్యలు చేపట్టిన తరువాత అభివృద్ధి పను లు చేపట్టాలని సూచించారు.

సదస్సులో ప్రతినిధుల అభిప్రాయాలను విన్న కలెక్టర్ విజయకృష్ణన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనుందన్నారు.

ప్రజాభిప్రాయ సదస్సుకు హాజరైన ప్రతినిధులు ఇచ్చిన సూచనలు, సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. సదస్సుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, వైసీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శిలు బి.వెంకటరమణ, రాజాన దొరబాబు, సీపీఎం నక్కపల్లి మండల అధ్యక్షుడు ఎం.రాజేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, ఏపీ రైతు సంఘం అచ్యుతాపురం మండల అధ్యక్షుడు బుద్ద రంగారావు, తీర ప్రాంతాలకు చెందిన మహిళా సంఘాల నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

- వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారిణి డాక్టర్ లూసి కార్డిలియా


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారిణి డాక్టర్ లూసి కార్డిలియా

పరవాడ, జూలై 23: వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందాలని వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారిణి డాక్టర్ లూసి కార్డిలియా సూచించారు. పరవాడ పీహెచ్‌సీ పరిధిలో గల వెన్నెలపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. గర్భిణుల నమోదు, వ్యాధి నిరోధక టీకాల అమలు, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, జననీ సురక్ష యోజన తదితర పథకాల ఆన్‌లైన్ విధానం ఎలా జరుగుతుందో పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె వైద్యసిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణులు హారిక, జయశ్రీ కర్మిషా, డీపీహెచ్ ఎన్ నాగమణి, డీపీవో జగదీశ్, ఎస్‌వోపి రామచంద్రరావు, డేటా మేనేజర్ వై.జనార్దనరావు, సీహెచ్‌వో సాయిరాం, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వాన దారిలో అవస్థల ప్రయాణం

- గోతులమయంగా అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు
- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు



అసకపల్లి- ఎరుకునాయుడుపాలెం మధ్య లంకెలపాలెం రోడ్డుపై గోతులు

సబ్బవరం, జూలై 23: మండలంలోని అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే రోడ్డు గోతులమయంగా తయారైంది. గత మూడేళ్లుగా వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు


ఎరుకునాయుడుపాలెం- లంకెలపాలెం మధ్య లంకెలపాలెం రోడ్డుపై గోతులు

రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అసకపల్లి-లంకెలపాలెం మధ్య ఉన్న ఎరుకునాయుడు పాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల వద్ద రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో వెళ్లాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గత రెండేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల ఈ రోడ్డుకు ఈ దుస్థితి వచ్చిందని, ఇప్పటికైనా స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

గరిష్ఠ స్థాయికి కోనాం నీటి మట్టం


మెయిన్‌గేటు ద్వారా విడుదల చేస్తున్న సాగునీరు

చీడికాడ, జూలై 23: మండలంలో కోనాం జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతోంది. జలాశయం గరిష్ఠ స్థాయి నీటి మట్టం 101.25 మీటర్లు కాగా మంగళవారం మధ్యాహ్నం నాటికి 99.25 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 250 క్యూసెక్కులు కాగా, మెయిన్, దిగువ గేట్లు ద్వారా 150 క్యూసెక్కుల సాగునీరు వృథాగా పోతున్నది.

చెరువు కాదు.. పంట భూమే..



మాడుగుల రూరల్, జూలై 23 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట భూములు చెరువులను తలపిస్తున్నాయి. వీరవిల్లి అగ్రహారంలోని ఎరుకువాడ చెరువు నీరు పారి పంట భూములు చెరువులా మారింది. వర్షం తెరిపిచ్చి పంట భూముల్లో నీరు తగ్గితే తప్ప పంటలు సాగు చేసేందుకు అవకాశం లేదని రైతులు చెబుతున్నారు.

పెద్ద చెరువులో నీటి నమూనాల సేకరణ

- వారంలోగా నివేదికలు వెల్లడిస్తామని పీసీబీ ఈఈ వెల్లడి
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పెద్ద చెరువులో నీటి నమూనాలను సేకరిస్తున్న పీసీబీ, ఎన్ఐవో సిబ్బంది

పరవాడ, జూలై 23 : పరవాడ పెద్దచెరువును పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులతో పాటు ఎన్ఐవో, మత్స్యశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఫార్మా యాజమాన్యాలు వ్యర్థ జలాలను గుట్టు చప్పుడు కాకుండా చెరువులోకి విడిచిపెట్టడంతో అధిక సంఖ్యలో చేపలు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదే విషయమై 'మళ్లీ చేపలకు చేటు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పీసీబీ, ఎన్ఐవో అధికారులు స్పందించారు. పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు ఆదేశాల మేరకు పీసీబీ సీనియర్ శాస్త్రవేత్త వీరేంద్ర, ఎన్ఐవో శాస్త్రవేత్త రామకృష్ణ, మత్స్యశాఖ అధికారులతో కలిసి చెరువులోని నీటి నమూనాలను సేకరించారు. అలాగే చెరువులోకి ఎటువైపు నుంచి వ్యర్థ జలాలు కలుస్తున్నాయో ఆ ప్రాంతమంతటినీ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో కూడా నీటి నమూనాలను సేకరించారు. వాటిని ల్యాబ్‌లో పరీక్షించి తుది నివేదికను వారంలోగా తెలియజేస్తామని పీసీబీ ఈఈ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ లోపం.. విద్యార్థులకు శాపం

- జాజులపాలెం పాఠశాల టీచర్లు తరచూ విధులకు డుమ్మా
- తల్లిదండ్రుల ఆరోపణ


తరగతి గదిలో ఉన్న విద్యార్థులు

చీడికాడ, జూలై 23: మండలంలోని విద్యా శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారు. మండలంలో కోనాం శివారు జాజులపాలెం ప్రభుత్వ పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. కానీ ఇక్కడ టీచర్లు తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈనెల 20వ తేదీన ఇద్దరు ఉపాధ్యాయులు డుమ్మా కొట్టగా.. విద్యార్థులు మాత్రం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాలలో వేచి చూశారు. మంగళవారం ఉదయం 10 గంటల తరువాత పాఠశాలకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజనాలు అనంతరం 1.30 గంటల తరువాత వెళ్లిపోయారని తల్లిదండ్రులు తెలిపారు. మండలంలో ఇద్దరు ఎంఈవోలు ఉన్నప్పటికీ పర్యవేక్షణ లేకపోవడం వలన ఉపాధ్యాయులు తరచూ డుమ్మా కొడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎంఈవో బొంజుబాబుని వివరణ కోరగా.. ఈనెల 20వ తేదీన భానుప్రసాద్ అనే ఉపాధ్యాయుడు సెలవు పెడుతున్నట్టు తనకు సమాచారం ఇచ్చారన్నారు. మంగళవారం మధ్యాహ్నం విధులకు నిర్వహించకుంటే విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'తాండవ'కు జలకళ


370 అడుగులకు చేరుకున్న తాండవ రిజర్వాయర్ నీటి మట్టం

నాతవరం జూలై 23: ఈ వర్షాలకు తాండవ జలాశయంలో నీటి నిల్వలు పెరగడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటి మట్టం 385 అడుగులు కాగా, ప్రస్తుతం 370 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లోకి 400 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నదని తాండవ డీఈఈ అనురాధ తెలిపారు. త్వరలో తాండవ ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి, నీటిని ఎప్పుడు విడుదల చేయాలనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

కనకదుర్గమ్మకు అర కిలో వెండి బహూకరణ


పలాస వాసిని సత్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 23 : స్థానిక గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ అమ్మవారికి పలాస వాసి పందిరి రామారావు మంగళవారం అర కిలో వెండి బహూకరించారు. ఆయనను ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు వీవీ రమణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం నాయుడు, బుద్ద భూలోకనాయుడు దంపతులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుందరయ్య


వెదురుపర్తి సుందరయ్య

అనకాపల్లి టౌన్, జూలై 23: అనకాపల్లి జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షునిగా పట్టణానికి చెందిన వెదురుపర్తి సుందరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాధవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకం పట్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్లపల్లి రంగాచారి, పట్టణ విశ్వబ్రాహ్మణసంఘం సభ్యులు కోటిపల్లి శ్రీను, కొమ్మోజు మల్లిబాబు, ఏ. శ్రీను అభినందనలు తెలిపారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో శ్రీనివాసరావుకు బంగారు పతకం



బంగారు పతకంతో శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, జూలై 23: మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఈ నెల 21 నుంచి 26 వరకు జరుగుతున్న జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి హాజరైన అనకాపల్లికి చెందిన ఎం.శ్రీనివాసరావు బంగారు పతకం సాధించారని వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి బద్రినాథ్ తెలిపారు. శ్రీనివాసరావు 59 కిలోల విభాగంలో ప్రాతినిధ్యం వహించి డెడ్‌లిఫ్ట్‌లో 181 కిలోల బరువు ఎత్తి జాతీయస్థాయిలో రికార్డు సృష్టించడమే కాకుండా స్క్వాట్‌లో 145 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 92.5 కిలోలు బరువు ఎత్తి ఓవరాల్‌గా బంగారుపతకం సాధించారని తెలిపారు. శ్రీనివాసరావును కోచ్ నానాజీని అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలా, కోశాధికారి అజయ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

నర్సీపట్నం నియోజకవర్గం

డొంకాడలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గొలుగొండ, జూలై 23 : మండలంలోని కొత్తఎల్లవరం గ్రామపంచాయతీలో శివారు డొంకాడ గ్రామంలో స్థానిక సర్పంచ్ కొల్లి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారి ధనుంజయ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సుమారుగా 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో నివాస పరిసరాల్లో వర్షపు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పడాలన్నారు. జ్వరం వచ్చినట్లైతే తక్షణం చీడిగుమ్మల పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మూర్తి, ఎంపీడీవో రత్నకుమారి, సిబ్బంది రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు అవగాహన సదస్సు

నర్సీపట్నం అర్బన్, జూలై 23 : మండలంలోని మంగళవారం గబ్బాడ గ్రామంలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఏవో అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 23వ తేదీ నుంచి కౌలురైతులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. భూయజమానికి ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈర్లె రాజేశ్వరి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజబాబు, స్థానికులు రాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్‌గా లాలం

నాతవరం జూలై 23 : జిల్లా చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్‌గా నాతవరం మండలం ములగపూడి గ్రామానికి చెందిన లాలం వెంకటరమణ నియమితులయ్యారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో

గొలుగొండ, జూలై 23 : వర్షాల సీజన్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో శిరీషారాణి మండల, గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. మండలంలోని మంగళవారం కొత్తఎల్లవరం, చీడిగుమ్మల, పాకలపాడు గ్రామాల్లో పర్యటించారు. చీడిగుమ్మల పీహెచ్‌సీలో వర్షాల సీజన్‌లో మలేరియా జ్వరాల నమోదు సంఖ్యపై జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వర్షాల సీజన్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ జ్వరాలు నమోదులేకాకుండా ప్రతేక వైద్య శిబిరాలు, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించే దిశగా సీఎం నారా చంద్రబాబునాయుడు, జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారని తెలిపారు. డ్రైనేజీల్లో పూడిక తీయించడంలో అలక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్య లు చేపడతామన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మూర్తి, ఎంపీడీవో రత్నకుమారి, డీపీఆర‌సీ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, సిబ్బంది రఘురాం, రమణి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో నిరుపయోగంగా మరుగుదొడ్లు


ఉపయోగం లేకుండా ఉన్న మరుగుదొడ్లు

కృష్ణాదేవిపేట, జూలై 23 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్లు ఉన్నా ఉపయోగించుకునేందుకు నీటి సౌకర్యం లేదు. దీంతో 20 రోజులుగా గిరిజన, మైదాన ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోటర్ పని చేసినప్పటికీ పైప్‌లైన్లు మరమ్మత్తులకు గురి కావడంతో వాటర్ ట్యాంకుకు నీరు సరఫరా అయ్యే వీలు లేక మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర అవసరాలు వచ్చే నీటి సరఫరాల నిలిచిపోయింది. దీనికితోడు వర్షాలకు వారం రోజులుగా ఆర్టీసీ బస్‌స్టేషన్ అంతా చెత్త, దుర్వాసనలతో అధ్వానంగా మారడంతో ఇక్కడ బస్సులు కోసం వేచి వుండే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడంతో మహిళ కష్టాలు వర్ణనాతీతం. ప్రతిరోజు వంద గ్రామాల నుంచి వచ్చే వెళ్ళే ప్రయాణికుల వేచి వుండే ఏజెన్సీ ముఖ ద్వారమైన ఈ బస్‌స్టేషన్‌లో సమస్యపై సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జాబ్‌మేళాలో 120 మంది ఎంపిక


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

నర్సీపట్నం, జూలై 23 : ఎంఎల్ఏఎస్ డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 120 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం కళాశాల ఆవరణలో ఉద్యోగ మేళాలో 340 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. హెటెరో హెచ్ఆర్ రాజు, కిరణ్, జాబ్ డీలర్స్ హెచ్ఆర్ సంతోష్ ఇంటర్వ్యూలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏఎస్ చైర్మన్ మీసాల సుబ్బన్న, ప్రిన్సిపాల్ పంపన తాతబ్బాయి, ఉద్యోగ కల్పన అధికారి రితీష్ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో శిక్షా సప్తాహ్

నర్సీపట్నం, జూలై 23 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా రెండో రోజైన మంగళవారం శిక్షా సప్తాహ్ నిర్వహించారు. చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన బోధనా పరికరాలను ప్రదర్శించారు. ఎంఈవో-2 నాగేంద్ర పాఠశాలను సందర్శించి విద్యార్థులను అభినందించారు. యరకన్నపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం ఆళ్ళ వరప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా టీఎల్ఎం మేళా నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేయించారు.


బోధనా పరికరాలను ప్రదర్శిస్తున్న టీచర్లు, విద్యార్థులు

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ వితరణ

నర్సీపట్నం, జూలై 23 : 1978-79 సంవత్సరంలో ఆర్‌సీఎంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.10 వేలు విలువ చేసే వాటర్ ప్యూరిఫైర్‌ని మంగళవారం స్కూలుకు విరాళంగా అందించారు.

భమిడికలొద్ది లేటరైట్ క్వారీలో వాటాలు విక్రయం!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందని, గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న వివాదాలు పరిష్కారమై క్వారీయింగ్ మొదలుపెడతామని వారిని నమ్మించాడు. అనపర్తికి సమీపంలో గల రాయవరానికి చెందిన ఒక ఫైనాన్షియర్ (గత ప్రభుత్వంలో కీలక కార్పొరేషన్ చైర్మన్ బినామీ)కు ఒక వాటా అమ్మేసి రెండు నుంచి మూడు కోట్ల రూపాయల వరకు తీసుకున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ఒకరి నుంచి, హైదరాబాద్‌లో సినీ నిర్మాణదారుడి నుంచి మూడు, నాలుగు కోట్ల రూపాయల చొప్పున తీసుకున్నాడు. ఇంకా తూర్పుగోదావరి జిల్లాలో మరో వ్యక్తి నుంచి రెండున్నర కోట్లు తీసుకున్నాడు. లీజుదారుడికి తెలియకుండా వ్యాపారంలో వాటాలు అమ్మకాలు జరిపినట్టు ఆలస్యంగా తెలిసింది. ఇదిలావుండగా క్వారీని బినామీ పేరిట తీసుకున్న వైసీపీ కీలక నేతలకు కూడా సమాచారం అందడంతో సంబంధిత వ్యక్తిని పిలిచి గట్టిగా హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో అతను అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని సరుగుడు ప్రాంతంలో లేటరైట్ క్వారీలో పనిచేసినవారు చెబుతున్నారు. ఇదిలావుండగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వైసీపీ పెద్దలు ఈ క్వారీపై మౌనంగా ఉండిపోయారు. భమిడికలొద్ది క్వారీలో వాటాలు కొనుగోలు చేసినవారు తమ వద్ద డబ్బులు తీసుకున్న బ్రోకర్ కోసం అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో వాటాలు కొనుగోలు చేసిన వారిలో ఒకర్దిదరు ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన కలిసి తమ గోడు చెప్పుకున్నారని తెలిసింది.

అభివృద్ధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

పెడుతుందనే ఆశలు రేకెత్తుతున్నాయి.

● కేంద్ర బడ్జెట్‌లో పారిశ్రామిక ప్రగతికి నిధులు రానుండడంతో అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు జిల్లాకు వచ్చే అవకాశాలున్నాయి. కేంద్ర బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాల ప్రజల ఆర్థిక వృద్ధితో పాటు రాబోయే రోజుల్లో పారిశ్రామికంగా అభివృద్ధి సాధించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

పోలవరం పూర్తితో ఉత్తరాంధ్రాకు మేలు

పోలవరం పూర్తిచేసే బాధ్యత తీసుకుంటామని ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల ఉత్తరాంధ్రా జిల్లాలకు మేలు జరగనుంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన నీటితో పాటు సాగునీరు, నగర వాసుల తాగునీటి సమస్యలు తొలగిపోతాయి. అదేవిధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి దోహదపడుతుంది.

పదేళ్లలో రాష్ట్రానికి మేలు చేకూర్చిన ఏకైక బడ్జెట్ ఇదే

- ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఏయూ



గడిచిన పదేళ్లలో రాష్ట్రానికి మేలు చేకూర్చిన ఏకైన బడ్జెట్ ఇదే. విభజన చట్టంలో పేర్కొన్న అనేక అంశాలకు సంబంధించి మేలు చేకూర్చేందుకు కేంద్రం సిద్ధమైనట్టుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనతో స్పష్టమైంది. ఆర్థికంగా బిహార్ కంటే రాష్ట్రానికి ఎక్కువ లబ్ధిని చేకూర్చేలా అనేక అంశాలపై ప్రకటన చేశారు. ముఖ్యంగా రాజధానికి ఆర్థిక సాయం అందించడంతోపాటు ఉత్తరాంధ్రతోపాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు అందిస్తామని ప్రకటించడం హర్షనీయం. దీనివల్ల రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగి, యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తంగా చూస్తే బడ్జెట్ మెరుగ్గా ఉంది. వ్యవసాయానికి కూడా భారీగా కేటాయింపులు పెంచారు. మహిళలు ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి భారీగా కేటాయింపులు చేయడం శుభపరిణామంగా చెప్పవచ్చు.

మాకవరపాలెంలో శిక్షా సప్తాహ్



మాకవరపాలెం, జూలై 23 : మండలంలో ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. మంగళవారం రాచపల్లి, గిడుతూరు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు బ్యాగులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. వారం రోజులు పాటు సాగే ఈ కార్యక్రమాన్ని మొదటి రోజు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రిని తాయారు చేసి ప్రదర్శించటం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక టీడీపీ నాయకులు రుత్తల జమీందార్ పాల్గొన్నారు.

రంగురాళ్ల క్వారీ వద్ద నిఘా పటిష్టం

గొలుగొండ, జూలై 23 : మండలంలో ఫారెస్ట్ భూముల్లో గల రంగురాళ్ల క్వారీల వద్ద తవ్వకాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు నర్సీపట్నం అటవీ సెక్షన్ రేంజర్ లక్ష్మీనర్స తెలిపారు. మండలంలోని మంగళవారం ఆరిలోవ అటవీ ప్రాంతం, కరక, సాలికమల్లవరం గ్రామం వద్ద గల క్వారీలను తమ సిబ్బందితో పరిశీలించి పలు సూచనలు అందించారు. వర్షాల నేపథ్యంలో రంగురాళ్ల తవ్వకాలు జరుగుతాయనే సమాచారంతో ముందస్తుగా తమ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. రాత్రి సమయాల్లో నిరంతరం తమ సిబ్బంది కాపలా ఉంటున్నారన్నారు.

పెంకుటిల్లు, గోడ నేలమట్టం

గొలుగొండ, జూలై 23 : మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమవారం రాత్రి గోడ, పెంకుటిల్లు శిథిలమయ్యాయి. గొలుగొండ పంచాయతీలో ఎరకల కాలనీలో గాదె అప్పలనాయుడుకు చెందిన ప్రహరీ గోడ, వారాది రాజబాబుకు చెందిన పెంకుటిల్లు శిథిలమైనట్లు వీఆర్‌వో తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాలకు ఎక్కడైనా ఇలాంటి నష్టాలు జరిగితే తమ దృష్టికి తేవాలని వీఆర్‌వో కోరారు.

చోడవరం నియోజకవర్గం

వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు

» జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి


బంగారుమెట్టలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో

బుచ్చెయ్యపేట, జూలై 23: వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం వడ్డాది కాజ్‌వే, విజయరామరాజుపేట డైవర్షన్ రహదారులను పరిశీలించారు. అనంతరం వడ్డాది సంపద కేంద్రాన్ని పరిశీలించారు. బంగారుమెట్టలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో డీపీవో మాట్లాడుతూ వర్షాలకారణంగా సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. డెంగ్యూ, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులు, బోర్లలో క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, వడ్డాది ఈవో లవరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రావికమతం, జూలై 23: సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రావికమతం పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ కుమారి సూచించారు. మండలంలోని కవ్వగుంట గ్రామంలో మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతుండడంతో జలుబు, దగ్గు, జ్వరంతో పాటు పలు రకాల రోగాలు సోకే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి ఒడబోసిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.సూర్యకుమారి, వైద్య సిబ్బంది సత్యనారాయణ, వరలక్ష్మి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో ప్రయాణం.. నరకప్రాయం!

రహదారి ఆద్యంతం గతుకుల మయం

వర్షం నీటితో చెరువుల్లా మారిన వైనం

వాహన చోదకుల భయంభయం



మేడివాడ పాలకేంద్రం వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు... అంజనేయస్వామి గుడి వద్ద భారీ గొయ్యి

రావికమతం, జూలై 23: మండలంలో ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భీమునిపట్నం-నర్సీపట్నం రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. రావిమతం నుంచి మేడివాడ పెద్ద చెరువు వరకూ అడుగడుగునా గతుకులు పడ్డాయి. వీటిలో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం వాహన చోదకులకు ప్రత్యక్ష నరకం చూపిస్తోంది.

వర్షపు నీటితో గోతులు నిండి ఉండడంతో లోతు ఎంత ఉందో తెలియక వాహనదారులు గోతుల్లో పల్టీలు కొడుతున్నారు. కొన్ని చోట్ల వర్షాలకు ముందు గ్రామస్థులు మట్టితో పూడ్చిన గోతులు ఇప్పుడు బురదమయంగా తయారయ్యాయి. దీంతో అడుగు తీసి అడుగు వేయలేని విధంగా మారాయి. ఫలితంగా వాహన రాకపోకలకు ప్రమాదభరితంగా పరిణమిస్తున్నాయి. మత్స్యవానిపాలెం నుంచి కొత్తకోట వరకు రోడ్డు ఇదే దుస్థితి దాపురించింది. ప్రధానంగా రావికమతం, మేడివాడ వరకు నాలుగు కిలోమీటర్లు దాటాలంటే గంట సమయం పడుతున్నదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాస్తా దూరం రోడ్డు గోతులు దాటితే ఓ గండం గట్టేక్కినట్టేనని వారు ఊపిరి తీసుకుంటున్నారు.

'జనసేన సిద్ధాంతాలను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్దాం'

బుచ్చెయ్యపేట, జూలై 23: జనసేన పార్టీ సిద్ధాంతాలను క్షేత్ర స్థాయిలో తీసుకు వెళ్దామని పార్టీ నాయకుడు దొండా సన్యాసిరావు పిలుపునిచ్చారు. వడ్డాదిలో మంగళవారం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీని మరింత బలోపేత చేసే దిశగా సభ్యత్వ నమోదు డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీ నాయకులు దాడి సూర్యనాగేశ్వరరావు, అడపా నరసింహామూర్తి, వీర్ల సురేష్, దాడి పెద గోవిందరావు, రసూల్ తదితరులు పాల్గొన్నారు

కుసర్లపూడిలో టీఎల్ఎం మేళా

రోలుగుంట, జూలై 23: మండలంలోని కుసర్లపూడి జడ్పీ పాఠశాలలో 'శిక్షా సప్తాహ్ (విద్యావారం) కార్యక్రమంలో భాగంగా టీఎల్ఎం మేళాను నిర్వహించారు. విద్యార్థులతో బోధన, విద్యా సామగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మోహన్‌రావు మాట్లాడుతూ పాఠశాల విద్యను మెరుగుపరచడానికి ఈ టీఎల్ఎంలు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు సులభంగా బోధన చేసేందుకు లో కాస్ట్-నో కాస్ట్ విధానంలో తయారుచేసి అందించామన్నారు. ఉపాధ్యాయులు విద్యావతి, అప్పన రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేకలకు నట్టల నివారణ టీకా వేయాలని నిరసన


మేకలతో నిరసన తెలుపుతున్న కాపరులు

రావికమతం, జూలై 23: మేకలకు నట్టల నివారణ టీకాలు వేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చీమలపాడు పంచాయతీ శివారు కడగెడ్డ గ్రామంలో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ గిరిజనులకు చెందిన మేకలు, గొర్రెలకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డిమాండ్ చేశారు. పశు సంపదను సంరక్షించేందుకు ప్రభుత్వం ఉచితంగా షెడ్లు నిర్మించాలన్నారు. పశు బీమా సౌకర్యాం కల్పించాలని, వైద్య సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నేత లక్ష్మణరావు, మేకల కాపరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల పండగలు


ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు.. దేవతామూర్తుల వేషధారణలు

బుచ్చెయ్యపేట, జూలై 23: వడ్డాదిలో మోదకొండమ్మ, మోదమాంబ అమ్మవార్ల పండగలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వడ్డాది కూడలి, పాత సినిమా హాలు వద్ద కొలువై యున్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలు, పసుపు, కుంకుమ, పిండి వంటలను భక్తులు నైవైద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, మాజీ సర్పంచ్ బత్తుల అరుణ, టీడీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేష్, నాయకులు దొండా గిరిబాబు, గుమ్మడి ప్రసాద్, దొండా నారాయణమూర్తి అమ్మవార్లను దర్శించుకున్నారు.

హాస్టల్ భవనం వినియోగంలోకి తీసుకురావాలి

రోలుగుంట, జూలై 23: మండలం కేంద్రం రోలుగుంటలో హైస్కూల్‌కు ఆనుకుని ఉన్న ఎస్టీ హాస్టల్ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఐటీడీపీ ఇన్‌చార్జి బనికెల సురేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. పదేళ్ల క్రితం ఈ హాస్టల్‌ను ప్రభుత్వం తీసేయడంతో నిరూపయోగంగా మారిందన్నారు. ఇప్పటికే స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఈ భవనంలో తరచూ మద్యం, గంజాయి తాగడానికి వినియోగిస్తున్నారని చెప్పారు. ఫలితంగా పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భవనం విషయమై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నారుమడుల్లో నీటి నిల్వలను తొలగించాలి

చీడికాడ, జూలై 23: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన నారుమడుల్లో నీటిని వెంటనే తొలగించాలని మండల వ్యవసాయ అధికారి రమాదేవి సూచించారు. మండలంలోని తునివలస, శిరిజాం గ్రామాల్లో నారుమడుల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను మంగళవారం రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వెంటనే ఆ నీరు తీసివేయాలని రైతులకు సూచించారు. అలాగే నారు కుళ్లినా, పురుగు పట్టినా సస్యరక్ష చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు.

ముద్ద చర్మ వ్యాధితో పశువులకు ముప్పు

రావికమతం, జూలై 23: ముద్ద చర్మ వ్యాధితో పశువులకు ముప్పు అని కొత్తకోట పశు వైద్యాధికారి బాలతేజ చెప్పారు. మండలంలోని కన్నంపేట, జడ్.జెన్నవరం, కేబీపీ అగ్రహారం, గుడివాడ గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి వల్ల పశువులు నీరంచి మరణిస్తాయని చెప్పారు. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుందన్నారు.

రోలుగుంట: మండలంలోని బుధవారం నుంచి పశువులకు వ్యాధి నిరోదక టీకాలు వేస్తామని పశు వైద్యాధికారి నూకేశ్వరరావు తెలిపారు. 24న కొంతలం, దిబ్బలపాలెం, బీబీపట్నం, 25న కొవ్వూరు, 26న అడ్డసరం, 27న నిండుగొండ, 29న రోలుగుంటలో శిబిరాలు ఉంటాయని చెప్పారు.


మాడుగుల నియోజకవర్గం


ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

వంద ఘటాలతో మోదకొండమ్మ పండగ

మాడుగుల, జూలై 23 : మండల కేంద్రంలోని మోదకొండమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. మాడుగులకు చెందిన మెండు అప్పారావు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో వంద ఘటాలతో పండగ చేశారు. ఘటాలను నెత్తిన పెట్టుకొని డప్పు వాయిద్యాల మధ్య భారీ మందుగుండు కాల్చుతూ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఘటాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. అనంతరం వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోండి



ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి, జూలై 23: ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు సూచించారు. మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆధార్ నమోదు చేసుకోవడంతో పాటు తప్పులను కూడా సరిదిద్దుకోవాలని అక్కడ ప్రజలకు సూచించారు.

చుక్కపల్లిలో ఆధార్ కేంద్రం తనిఖీ

చీడికాడ: మండలంలోని చుక్కపల్లి గ్రామంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఎంపీడీవో ఉమామహేశ్వరి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఒకటి నుంచి 14 ఏళ్ల లోపు వారికి కొత్తగా ఆధార్ నమోదుతో పాటు మిగిలిన తప్పులను సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్చియ్యమ్మ, వీఆర్‌వో మోదినాయుడు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు


ముత్యవమ్మ (ఫైల్)

చీడికాడ, జూలై 23: మండలంలోని శిరిజాం గ్రామానికి చెందిన కన్నూరు ముత్యవమ్మ (69) వారం రోజులుగా కనిపించలేదని ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440904210, 9948705850 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.